
# భగవాన్
# శ్రీ వెంకయ్య స్వామి వారి పూజ



ఇందులోని ప్రార్థన, దండకము గురుస్తుతి శ్రీస్వామి వారు శరీరంతో మన మధ్య వుండగా నిత్యమూ మూడువేళలా శ్రీస్వామి వారికి హారతిచ్చి శ్రీ స్వామి వారి సేవకులందరూ శ్రద్ధా భక్తులతో చెప్పుకునేవారు. కొందరు శ్రీ స్వామి వారి అష్టోత్తరం కూడా చేసేవారు.


ప్రాప్తి స్థానము :

**పెసల సుబ్బరామయ్య**

శ్రీ స్వామి కృప పబ్లికేషన్స్

గొలగమూడి పోస్ట్

(వయా) సర్వేపల్లి

నెల్లూరు జిల్లా - 524 321.

**వెల : ఒకటిన్నర రూపాయి**

# పూజ యొక్క ఉపయోగములు

భగవద్గీతలో దేవ, ద్విజ, గురు, ప్రాజ్ఞపూజనం మానవులందరూ చేయవలసిన శారీరక తపస్సని చెప్పారు. అంటే దేవుణ్ణి, బ్రహ్మజ్ఞానము కొరకు ప్రయత్నించు వారిని, సద్గురువులను, శాస్త్రజ్ఞానము చక్కగా తెలిసినవారిని ప్రతివారు నిత్యం పూజించాలని అది శారీరక తపస్సని చెప్పారు. ఇది చక్కగా ఆచరిస్తే దీని ఫలితముగా దీనికిపైస్థితులైన వాచక, మానసిక తపస్సులు చేయగలుగతాడు.

పూజ మరొక విధంగా కూడా ఉపయోగపడుతుంది. చంచలమైన మనస్సును ఏకాగ్రము చేయుటకు పూజ ఒక దివ్యసాధనమని మహనీయులందరూ బోధించారు.

పూజకు గల మూడవ ఉత్తమోత్తమమైన ఉపయోగము - భగవంతుడు నిజంగా 'మననుండి కోరేదేమిటి?

(1) మన మనస్సు

(2) మన కాలము (ఆచార్య భరద్వాజవాణి)

వీటిలో మనస్సువారి కర్పించాలని మనం తలచినా అదిదాని చంచల స్వభావం మానదు. కానీ క్రమం తప్పకుండా ప్రతి రోజూ ఒకే కాలంలో పూజచేస్తూ వస్తే మనం భగవంతునికి మన కాలం సమర్పించిన వాళ్ళమవుతాము. అందుకు వారు సంప్రీతులై మన మనస్సును గూడా ఆ భగవంతుడే గ్రహించి అది స్థిరంగా భగవంతుని పై నిలిచేటట్లు అనుగ్రహిస్తారు.

ఇన్ని విధాల ఉపయోగకరమైన పూజను అందులోని మంత్రాల అర్థాలు తెలుసుకొని చేయడం చాలా అవసరము. మంత్రాల అర్థం తెలుసుకొని ఆమంత్రార్థమును భావన చేస్తూ నిదానంగా పూజచేయాలి. అంతేగాని మంత్రాల అర్థాన్నే భావన చేయకుండా గ్రుడ్డిగా పూజచేసి చాలా స్వల్పమైన ఫలితం పొందడం విచారకరము. మన ఇంటికి వచ్చిన మన

ఆత్మీయునకు మనం చేసే ఉపచారాలే (మర్యాదలు) షోడశ ఉపచారాలు. కూర్చునేందుకు ఆసనమివ్వడం, కాళ్ళు కడగడం వగైరా. మనం పూజించేమహనీయుడు నిజంగా మన ఇంటికి వచ్చాడని భావనచేస్తూ ఆయా ఉపచారాలు చేయడం ముఖ్యం.

పూజ చేయడంలోని అంతరార్థం తెలియకుంటే పూజచేయడం యాంత్రికమై అలా చేస్తుంటే మనకేదో అవుతుందనే భ్రమలో ఉంటాము. మన పరిస్థితిలో మార్పులేనందున కొన్నాళ్ళకు మనవే పూజచేయడం మానేస్తాము. భగవంతుడు సర్వమూ తెలిసినవాడు, సర్వత్రా ఉన్నవాడు. ఏమైనా చేయగలవాడు. జీవుల ఎడల ఎంతోదయగలవాడు అనే విషయం తెలిసి ఉండాలి. వారిచరిత్ర చక్కగా అనేక సార్లు పారాయణం చేయడం అవసరం. శ్రీ స్వామివారు అట్టి భగవంతుడని తెలియాలి. మన పొగడ్తలతో మురిసిపోయే వెర్రివాడుకాదు. రాజకీయ నాయకుడూ కాదు. మన మనస్సు, హృదయము, శ్రద్ధను ఆసించే జగత్పిత వారు. మన కాలము, మనస్సులను మాత్రమే వారు నిజంగా మన నుండి కోరేవి. మన కాలము మనస్సు సమర్పించేందుకు ఉపయోగపడేదేపూజ. పూజలో చెప్పే మంత్రాల అర్థం తెలుసుకోవడం ముఖ్యం. తీరికవేళలలో ఊసుబోని కబుర్లతో కాలంవ్యర్థం చేసుకొని పాపం మూట గట్టుకునే బదులు ఆమంత్రాల అర్థం మననం చేసుకుంటే కొంతసేపు వారి స్మరణలో ఉండగలుగుతాము.

భగవంతుని నామాల అర్థం తెలుసుకొని స్మరిస్తుంటే ఉత్తమోత్తమ ఫలితం పొందడం తథ్యం. పూజ శారీరకము, వాచకము, మానసికముగా ఉంటుంది. ఏ తరగతికి చెందిన వారికి అది మంచిది. మన కాలము మనస్సు శ్రీ స్వామివారికి సమర్పించి వారికృప పొందుదాం!

జై గురుదేవా!

# శ్రీ గురుదేవుల ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా! మాలోపల, వెలుపల, మీదను, క్రిందను అంతటనూ నిండియున్న ఓ సర్వాంతర్యామీ! మా లోపల ప్రతి అణువందును యిమిడియుండి, మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, ప్రాణములకు ప్రాణము, శ్వాసలకు శ్వాస, ఆత్మకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ! మిమ్ము తెలుసుకొను భాగ్యము యిప్పుడు ఇచ్చటనే ప్రసాదింపుము. ఓ తేజోమయ మూర్తీ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల ఈ విశ్వమందంతటనూ, అందరునూ మీ దివ్యతేజస్సును గ్రహింతురు గాక, ఓ సచ్చిదానంద స్వరూపా! ప్రతిమానవ హృదయము నందును, నానా జాతి మధ్యస్థము నందును శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము. ఓ గురుదేవా! యిదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

**<u>ఆచమనము :-</u>** ఓం కేశవాయ స్వాహా, నారాయణాయ స్వాహా, మాధవాయ స్వాహా (అని ముమ్మారు ఆచమించి) శ్రీ గోవిందాయ నమః (అని చేయికడుక్కొని ఈ క్రింది నామాల చివర నమః అని స్మరించాలి) శ్రీ విష్ణవేనమః, మధుసూదనాయ, - త్రివిక్రమాయ - వామనాయ - శ్రీధరాయ - హృషీకేశాయ - పద్మనాభాయ - దామోదరాయ - సంకర్షణాయ - వాసుదేవాయ - ప్రద్యుమ్నాయ, అనిరుద్ధాయ, పురుషోత్తమాయ - అధోక్షజాయ - నారసింహాయ - అచ్యుతాయ - జనార్థనాయ - ఉపేంద్రాయ హరయే - శ్రీ కృష్ణాయ నమః అని ఉద్ధరిణతో నీరువదిలేది.

కేశవ - సూర్య కిరణముల వంటి కేశములు గలవాడు

నారాయణ - నరుడనగా ఆత్మ - ఆత్మయగు నరుని వలన కలిగిన ఆకాశాది కార్యములు నారములు. అట్టి నారములు గలవాడు నారాయణుడు.

మాధవ - మా అనగా శ్రీదేవి ఆమె భర్తగనుక మాధవుడు

గోవిందాయ - గో అనగా వాణి - వాణిని పొందిన వారు గోవిందులు

విష్ణవే - సర్వజగత్తున వ్యాపించినవాడు.

మధుసూదన - మధు అను రాక్షసుని సంహరించినవాడు

త్రివిక్రమ - మూడులోకములలోను వ్యాపించినవాడు

వామన - బలిచక్రవర్తిని వామన రూపములో యాచించినవాడు

శ్రీధర - సర్వభూతములకు జననియైన శ్రీదేవిని వక్షస్తలమున ధరించినవాడు.

హృషీకేశ - హృషీకములనగా ఇంద్రియములు. ఇంద్రియములు తన వశములో నుంచుకొన్నవాడు.

పద్మనాభ - పద్మము నాభియందుగలవాడు

దామోదర - దామ అనగా త్రాడు. యశోదాదేవిచే ఉదరమున త్రాడుచే బంధింపబడినవాడు.

సంకర్షణ - సంహార కాలమున జీవులను ఒక్కసారిగా ఆకర్షించువాడు

వాసుదేవ - సర్వత్ర ఉన్నవాడు

ప్రద్యుమ్న - ప్రకృష్టమైన ధనము కలవాడు

అనిరుద్ధ - శత్రువులచే ఎన్నడును నిరోధింపబడనివాడు

పురుషోత్తమ - పురుషులలో నుత్తముడు

అధోక్షజాయ - ఎల్లప్పుడు ఊర్ధ్వరూపుడు

నారసింహ - నరుని యొక్కయు మరియు సింహము
యొక్కయు అవయవములుగలవాడు.

అచ్యుత - నాశరహితుడు

జనార్థన - దుర్జనులను హింసించువాడు, జనులచే పురుషార్థము
యాచించబడువాడు.

ఉపేంద్ర - ఇంద్రుని మీద ప్రభువు

హరిః - సంసారము హరించువాడు

శ్రీకృష్ణాయ - కృష్ణవర్ణముగల శరీరము గలవాడు

**సంకల్పము** :- సర్వమూ తెలిసిన మీకు నేనేమి చెప్పుకోగలను. నాకేది మంచిదో అదే చేయండి. అన్నివేళలలోను మీ రక్షణ కలుగుటకు నేను ఎలా నడుచుకోవలెనో ఆవిధముగా సత్యం, ధర్మం తప్పకుండా మీకు తృప్తికరముగా నా జీవితమును నడిపించు ప్రభూ. నిరంతరమూ మీ అండనాకుండేందుకు మిమ్ములను పూజించుచున్నాను.

## గణపతి పూజ

**శుక్లాం భరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్న వదనం ధ్యాయే సర్వవిఘ్నోప శాంతయే**

శ్రీ గణాధ్యక్షాయనమః ధ్యాయామి - ఆవాహయామి ఆసనం సమర్పయామి (పూజా పీఠముపై అక్షింతలువేసేది)

పాదయో పాద్యం సమర్పయామి

హస్తయో అర్ఘ్యం సమర్పయామి

శుద్ధాచమనీయం సమర్పయామి

స్నానం సమర్పయామి

(ఉద్ధరిణతో నీరువదిలేది)

వస్త్రార్ధాన్ అక్షితాం సమర్పయామి
యజ్ఞోప వీతార్ధాన్ అక్షితాంసమర్పయామి
గంధం సమర్పయామి
పుష్పాణిం పూజయామి - ఈ క్రింది ఒక్కొక్క నామం చెపుతూ పువ్వులు విఘ్నేశ్వరునికి అర్పించేది.
ఓం సుముఖాయనమః
విఘ్నరాజాయనమః
విఘ్నహంత్రేనమః
విచిత్రవేషాయనమః
మూషిక వాహనాయనమః
ధూమకేతవేనమః
పాలచంద్రాయనమః
పార్వతీ పుత్రాయ నమః
ఈశ్వరపుత్రాయ నమః
మహాగణాధిపతయే నమః
ధూపమాఘ్రాపయామి (సాంబ్రాణి నిప్పుపై వేసేది లేనిచో సాంబ్రాణి కడ్డీ త్రిప్పేది)
నైవేద్యం -: శ్రీ గణాధి పతయైనమః నైవేద్యం సమర్పయామి.
ఓం ప్రాణాయ స్వాహ ఓం అపానాయ స్వాహ
ఓం వ్యానాయ స్వాహ ఓం ఉదానాయ స్వాహ
ఓం సమానాయ స్వాహ ఉత్తరా పోశనం సమర్పయామి
(నైవేద్యం చుట్టూ ఉద్ధరిణతో నీరువదిలేది)
చత్రమాచ్ఛాదయామి, చామరం వీచయామి
నృత్యం దర్శయామి, ఆందోళికా నారోహయామి
అశ్వానారోహయామి, గజానారోహయామి
సమస్త రాజోపచార, శక్త్యుపచార భక్త్యుపచార పూజాం సమర్పయామి. సర్వం శ్రీ గణేశార్పణమస్తు.

# షోడశోపచార పూజావిధానము

<u>ధ్యానము :</u>

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుస్సాక్షాత్పరబ్రహ్మ తస్మైశ్రీ గురవేనమః ॥**

1. **ఆవాహనము (ఆహ్వానించుట) :**

**ఆవాహయామి సద్భక్త్యా నిత్యానందం మహామతిం ।**
**సర్వధర్మపరం నిత్యం పూర్ణానంద్యైక విగ్రహం ॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః ఆవాహయామి.*

తా॥ ఎల్లప్పుడు ఆత్మానందమును గ్రోలుతూ, జగద్ధితమనే బృహత్కార్యాన్ని నిర్వహించగల వానిని, సర్వ ధర్మములూ ఎవరిని చేరుకొనుటకు సహకరించునో అట్టి నిత్యుడు, మూర్తీభవించిన పూర్ణ బ్రహ్మానంద్యైకరూపుడూ అయిన గురువును కేవలం మోక్షాపేక్ష అను సద్భక్తితో ఆహ్వానిస్తున్నాను.

2. **ఆసనము సమర్పించుట :**

**కల్పద్రుమూలే మణివేది మధ్యే**
**సింహాసనం స్వర్ణమయం సురత్నం ।**
**విచిత్ర వస్త్రావృత మచ్యుత ప్రభో**
**గృహాణ లక్ష్మీ ధరణీసమన్విత ॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః ఆసనం సమర్పయామి.*

తా॥ కల్పవృక్షమూలమున (లేక త్రిగుణములతో నిత్యము వర్ధిల్లు సృష్టియనెడి వృక్షమూలమున) మణులు పొదిగిన వేదిక మధ్య (లేక మనస్సు యనెడి మణివేది మధ్య) మంచి రత్నములు పొదిగిన స్వర్ణ సింహాసనము (లేక మంత్ర శబ్దమయమైన సింహాసనమును) అందమైన వస్త్రములచేత కప్పబడిన దానిని స్వీకరించవలసినది - భూదేవి, లక్ష్మీదేవులతో కూడియున్న ఓ విష్ణు రూపుడవైన సద్గురూ!

వివరణ : భూమి జన్మనిచ్చి కర్మక్షయము ద్వారా పరమార్థమునూ, లక్ష్మి ఒకవంక ఐహిక సంపదల రూపమున భుక్తినీ, దైవీ లక్షణముల రూపమున జీవన్ముక్తినీ యిచ్చును. కనుక ఈ రెండింటిని ప్రసాదించు సద్గురువు ఈ విధముగ వర్ణించబడినాడు.

**3. పాద్యం (పాదములు కడుగుట) :**

**గంగాజలం సమానీతం సుగంధ ద్రవ్య సంయుతమ్।**
**పాద్యం త్వం ప్రతిగృహ్ణీష్వ దేవదేవ నమో స్తుతే॥**

**తా॥** సుగంధ ద్రవ్యములతో కూడియున్న గంగాజలమును (నాచే) తేబడిన దానిని, మీరు పాద్యముగా స్వీకరింపుడు.

వివరణ : శుభేచ్ఛతోకూడిన మనస్సుకు సుగంధ ద్రవ్యములతో కూడిన గంగాజలము సంకేతము. అట్టి మనస్సుతో గురువుయొక్క స్థూల, దివ్యస్థితులు అను పాదములను ధ్యానించడమే పాదములు కడుగుటగా సంకేతించబడినది.

**పాద్యం గృహాణ భో స్వామిన్! తీర్థపాద దయాకర।**
**శిష్యవత్సల! సర్వజ్ఞ! ఆశ్రితామరకల్పక॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః పాదయోః పాద్యం సమర్పయామి.*

**తా॥** ఆశ్రితులకు అమరత్వము కల్పించువాడవు, సర్వజ్ఞుడవు, శిష్యవత్సలుడవు, దయాకరుడవు, సర్వతీర్థములను నీ పాదములందు కలవాడవు - అట్టి ఓ జగత్ప్రభూ! పాద్యమును స్వీకరించవలసినది.

**4. అర్ఘ్యం :-**

**ధర్మస్వరూప ధర్మజ్ఞ తులసీదామ భూషణ।**
**కంబు గ్రీవ మయాదత్తం గృహాణార్ఘ్యం నమో స్తుతే॥**
**అర్ఘ్యందాస్యామ్యహం భక్త్యా తవ హస్తాగురూత్తమ।**
**సంగృహీత్వా మహాభాగ కురు సంసారతారణమ్॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః హస్తయోరర్ఘ్యం సమర్పయామి.*

తా॥ ఓ ధర్మస్వరూపుడా! ధర్మజ్ఞ! తులసిమాలనే భూషణముగా కలవాడా! సుందరమైన మెడ కలవాడా! నేనిచ్చు అర్ఘ్యమును స్వీకరించవలసినది. నీకు నమస్కారము.

తా॥ ఓ సద్గురూత్తమా! మీ హస్తములకు అర్ఘ్యమును సమర్పించెదను. మహాభాగా! దానిని గ్రహించి నన్ను సంసారసాగరమునుండి తరింపచేయవలసినది.

వివరణ : కామమును గాక ధర్మమునే ప్రధానముగా ఎరిగిన సద్గురువు తులసిమాలను గాక స్వర్ణాభరణములను ధరించడు. సద్గురువు తన కవసరములేకపోయిననూ ప్రజలకు సద్ధర్మమును ఆచరించి చూపును. నిత్యము సూర్యునికి, దేవతలకూ అర్ఘ్యమిచ్చుట పారమార్థికుల ధర్మము. అందుకే శ్రీస్వామికి అర్ఘ్యమునకై నీరు సమర్పించుట.

**5. ఆచమనము (గొంతుతడుపుకొనుట) :-**

**కర్పూర వాసితం తోయం సువర్ణ కలశ స్థితం।**
**దదామ్యాచమనం భక్త్యా దేవదేవ నమో స్తుతే॥**
**జ్ఞాన వైరాగ్య సంపన్న భవరోగైక భేషజ।**
**గృహాణత్వం మయాదత్తం ఇదమాచమనీయకం॥**

శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః ఆచమనీయం సమర్పయామి.

తా॥ ఓ దేవ దేవ! కర్పూరము నుంచబడిన నీటిని, సువర్ణ కలశముననున్న దానిని భక్తితో ఆచమనమునకు యిచ్చుచున్నాను. నీకు నమస్కారము.

తా॥ జ్ఞానవైరాగ్యములను సంపదగా కలిగిన ఓ భవరోగ వైద్యుడా! ఆచమనమునకు నేనిచ్చు నీటిని స్వీకరించవలసినది.

**6. స్నానము :-**

**గంగాది పుణ్యసలిలైః మయానీతైః శుభావహైః।**
**స్నాపయిష్యామ్యహం భక్త్యా ప్రసన్నోభవ సద్గురు॥**

శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః స్నానం సమర్పయామి.

తా॥ శుభావహమైన, నాచేత తేబడిన గంగాది పుణ్యనదీ జలములతో భక్తితో మీకు స్నానము చేయించెదను. ఓ సద్గురూ ! ప్రసన్నుడవుకమ్ము.

శ్లోకవివరణ :- శుభావహమైన, నాచే తేబడిన గంగాది పుణ్యనదీజలములతో భక్తితో మీకు స్నానము చేయించెదను. ఓ సద్గురూ ! ప్రసన్నుడవుగమ్ము.

**7. వస్త్రము :**

**స్వర్ణాంచలం చిత్రవిచిత్రశోభితం కౌశేయ యుగ్మం పరికల్పితంమయా।**
**దామోదర ప్రావరణం గృహాణ మాయాచల ప్రాకృత దివ్యరూప॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః వస్త్రయుగ్మం సమర్పయామి.*

శ్లోకవివరణ :- మాయచే చలించని వాడవయ్యును నీదివ్యశక్తిచే ప్రకృతి సిద్ధమైన మానవ రూపము ధరించిన సద్గురూ! నాచే చిత్ర, విచిత్ర శోభలు గలది, బంగారు అంచుగల వస్త్రద్వయము చేయబడినది. ఓ దామోదరా! వాటినాచ్ఛాదనము కొరకు స్వీకరించవలసినది.

**8. యజ్ఞోపవీతము :**

**తంతుం తన్వన్ మయాభక్త్యా బ్రహ్మసూత్రం వినిర్మితం।**
**దాస్యామి ధారణార్థంవై గృహాణ బ్రహ్మవిద్వర ॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః యజ్ఞోపవీతం సమర్పయామి.*

శ్లోకవివరణ :- ఓ బ్రహ్మవిద్వరా! నాచే భక్తితో తంతువు వడకబడి యజ్ఞోపవీతము నిర్మించబడినది. దానిని మీరు ధరించుటకు ఇచ్చుచున్నాను. స్వీకరించవలసినది.

గమనిక : సాధకుడు త్రిగుణాలవశుడై అధిభౌతిక, అధిదైవిక, ఆధ్యాత్మికతాపములకు బద్ధుడనై యున్నానని గుర్తుంచుకొని, నిరంతరమూ వాటినుండి విముక్తికై నిష్కామముగా పంచయజ్ఞములను నిర్వహింతునని

దీక్షబూనిన దీక్షాబంధమే యజ్ఞసూత్రము. వారికట్టి ధర్మమును బోధించుటకై సద్గురువు గూడ ధరించును గనుక వారికి యజ్ఞోపవీతము సమర్పించుట భక్తుని ధర్మము.

**9. గంధము :-**

**కస్తూరికా చందన కర్థమాని కాశ్మీర సంయోజిత గంధసారైః**

**విలేపనం స్వీకుర దేవ దేవ శ్రీభూమి వక్షోజ విలేపనార్హమ్॥**

**చందనాగరు కర్పూరం కేశరాద్యైర్విమిశ్రితమ్॥**

**గంధం దాస్యామ్యహం భక్త్యా సద్గురూత్తమ స్వీకురు॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః గంధం సమర్పయామి.*

శ్లోకవివరణ :- కస్తూరి, చందనము, ఏలకులు, కాశ్మీరము నుండి తేబడిన గంధసారములతో కలిపితిని. ఓ దేవదేవ! ఆ మైపూత స్వీకరించవలసినది. లక్ష్మీదేవి, భూదేవి గూడా పూసుకొనదగినది.

శ్లోకవివరణ :- చందనము, కర్పూరము, అగరు, పుష్పముల కేసరములు కలిపి సిద్ధము చేయబడిన గంధమును భక్తితో సమర్పించుచున్నాను. ఓ సద్గురూత్తమా! స్వీకరింపుము.

**10. పుష్పములు :-**

**కల్హారైశ్చంపకైర్జాజీ పున్నాగైర్మల్లికాదిభిః।**

**మందారైః పూజయిష్యామి స్వీకుర్వాచార్య సత్తమ॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః పుష్పైః పూజయామి.*

శ్లోక వివరణ :- ఆయా పేర్లుగల పువ్వులతో పూజించెదను. ఆచార్యసత్తమా ! స్వీకరింపుము.

## అంగపూజ

**ఓం తీర్థపాదాయనమః - పాదౌపూజయామి.**

సకల తీర్థములను పాదములయందుగలవాడా! నీ పాద ద్వయమును పూజించుచున్నాను.

**ఓం బలాయనమః। జంఘే పూజయామి.**

పిపీలికాది బ్రహ్మ పర్యంతము సకల జీవుల బలము నీవైన వాడా! నీ పిక్కలను పూజించుచున్నాను.

**ఓం ఆధారభూతాయనమః - జానునీ పూజయామి.**

సర్వమునకూ ఆధారభూతుడైన వానికి నమస్కారము। నీ మోకాళ్లను పూజించుచున్నాను.

**ఓం విశ్వ ప్రపూజితాయనమః। ఊరూ పూజయామి.**

విశ్వముచేత బాగుగా పూజింపబడువానికి నమస్కారము। నీ తొడలను పూజించుచున్నాను.

**ఓం జితేంద్రియాయ నమః। గుహ్యం పూజయామి.**

జితేంద్రియునకు నమస్కారము. నీ గుహ్యమును పూజించుచున్నాను.

**ఓం స్థితప్రజ్ఞాయ నమః। కటిం పూజయామి.**

ఎల్లప్పుడు స్థిరముగా నుండు జ్ఞానముగలవానికి నమస్కారము. నీనడుమును పూజించుచున్నాను.

**ఓం మితాశనాయనమః - ఉదరం పూజయామి.**

నియమిత ఆహారమును శరీరధారణమునకు అవసరమైనంతవరకే భుజించువానికి నమస్కారము. నీ ఉదరమును పూజించుచున్నాను.

**ఓం విశాలవక్షాయనమః। వక్షస్థలం పూజయామి.,**

విశాల వక్షము గలవానికి నమస్కారము. నీ వక్షస్థలమును పూజించుచున్నాను.

**ఓం శుద్ధ హృదయాయనమః - హృదయం పూజయామి.**

అజ్ఞాన జనిత సంకల్పములులేక, శుద్ధముగనున్న హృదయము గలవానికి నమస్కారము. అట్టి నీ హృదయమును పూజించుచున్నాను.

**ఓం శిష్యవత్సలాయ నమః। స్థనౌ పూజయామి.**

శిష్యులపై మాతృవాత్సల్యము గలవానికి నమస్కారము. నీ స్తన ద్వయమును పూజించుచున్నాను.

**ఓం ఆత్మోద్ధారకాయ నమః। భుజౌ పూజయామి.**

జీవాత్మనుద్ధరించువానికి నమస్కారము, నీ భుజద్వయమును పూజించుచున్నాను.

**ఓం దాన హస్తాయ నమః। హస్తౌ పూజయామి.**

(భుక్తిని, ముక్తిని), దానమిచ్చువానికి నమస్కారము. నీ హస్తద్వయమును పూజించుచున్నాను.

**ఓం కంబు కంఠాయ నమః - కంఠం పూజయామి.**

అందమైన కంఠము గలవానికి (లేక దయార్ద్రమైన కంఠస్వరము గలవానికి) నమస్కారము. మీ కంఠమును పూజించుచున్నాను.

**ఓం ప్రసన్న వదనాయ నమః। ముఖం పూజయామి.**

ప్రసన్న వదనునకు నమస్కారము. మీ ముఖమును పూజించుచున్నాను.

**ఓం మృదు భాషణాయ నమః - జిహ్వాం పూజయామి.**

(అర్థము స్పష్టము)

**ఓం కరుణాజలనిధయే నమః - నేత్రే పూజయామి.**

కరుణా సముద్రునికి నమస్కారము. మీ నేత్ర త్రయమును పూజించుచున్నాను.

**ఓం శాస్త్రానుసారిణేనమః - కర్ణౌ పూజయామి.**

(గురువువద్ద శ్రవణముచేసిన) శాస్త్రములను అనుసరించువానికి నమస్కారము. మీ కర్ణద్వయమును పూజించుచున్నాను.

**ఓం సర్వజ్ఞాయనమః - సర్వాణ్యంగాణి పూజయామి.**

సర్వజ్ఞునికి నమస్కారము. మీ సర్వాంగములనూ పూజించుచున్నాను.

# నామావళి

1. ఓం సర్వసమర్థ సద్గురు శ్రీ స్వామి నాథాయనమః (9 సార్లు)
2. ఓం గురుదేవ దత్తాత్రేయాయ స్వామి నాథాయనమః (9 సార్లు)
3. ఓం విశ్వప్రాణాయ స్వామి నాథాయనమః

   విశ్వములోని గ్రహగోళాలన్నింటికి చలనము గలదు. చలనమే ప్రాణశక్తిగా మనము తలంచుచున్నాము. ప్రాణశక్తే, తానైన ॥శ్రీ స్వా॥
4. ఓం పంచభూతాత్మ స్వరూపాయ నమః

   భూమి, ఆకాశము, అగ్ని, నీరు, వాయువు రూపాలుగా ప్రకటమైన ॥శ్రీ॥
5. ఓం ప్రాణలింగ స్వరూపాయ నమః

   విశ్వమంతటినీ క్రమబద్ధంగా నిలిపి నడుపు ప్రాణశక్తే తన రూపముగాగల శ్రీ స్వామివారికి నమస్కారము.
6. ఓం విశ్వలింగాయనమః

   విశ్వమే తన దేహముగాగల శ్రీ స్వామివారికి నమస్కారము.
7. ఓం చిదంబరాయనమః

   అంబరము అనగా వస్త్రము. చిదాకాశమే తన వస్త్రముగాగల శ్రీ స్వామికి నమస్కారము.
8. ఓం బహిరంతర్వ్యాపినే నమః

   మన బయట, లోపలా ఉన్న శ్రీ స్వామి వారికి నమస్కారము.
9. ఓం దేహస్థపృధి వ్యాపస్తేజోవాయురాకాశ స్వరూపాయ నమః

   మన దేహములోని భూమి, ఆకాశము, వాయువు, అగ్ని నీరుగా ఉన్న శ్రీ స్వామి వారికి నమస్కారము.
10. ఓం చిద్రూపాయ నమః - చైతన్య రూపుడైన ॥శ్రీ॥
11. ఓం చైతన్యలింగాయ నమః - సమిష్టిచైతన్యరూపుడైన ॥శ్రీ॥
12. ఓం సర్వవ్యాపినేనమః

    అంతటా వ్యాపించియున్న ॥శ్రీ॥

13. **ఓం దిగంబరాయ నమః**
అంబరమనగా వస్త్రము. దిక్కులనే వస్త్రముగా గల శ్రీ స్వా॥

14. **ఓం కేవలాయ నమః**
తానొక్కడు తప్ప అన్యమేలేని శ్రీ స్వా॥

15. **ఓం విశ్వసాక్షిణే నమః**
ఈ విశ్వాన్నంతా సాక్షీ భూతుడుగా చూస్తున్న శ్రీ స్వా॥

16. **ఓం సర్వజీవస్వరూపాయ నమః**
అన్ని జీవుల రూపంలో నున్న శ్రీ స్వా॥

17. **ఓం నామరూపరహితాయ నమః**
ఏ పేరుగాని, రూపముగాని లేని శ్రీ స్వా॥

18. **ఓం సర్వనామ రూపిణే నమః**
అన్ని పేర్లు, అన్ని రూపములు తానే అయిన శ్రీ స్వా॥

19. **ఓం విశ్వరూపాయ నమః**
విశ్వమే తనరూపముగా గల శ్రీ స్వా॥

20. **ఓం విరూపాయ నమః**
స్వతహాగా ఒక రూపమంటూ లేని శ్రీ స్వా॥

21. **ఓం విరూపాక్షాయ నమః**
రూపము లేకున్ననూ, గుర్తించు స్వభావముగల శ్రీ స్వా॥

22. **నిర్గుణాయనమః** ఏగుణము లేని శ్రీ స్వా॥

23. **ఓం నిశ్చలాయ నమః**
అంతటా నిండియున్నందున - కదలుటకు వీలులేని శ్రీ స్వా॥

24. **ఓం చంచలాయ నమః**
వస్తువుల యొక్క, మనస్సు యొక్క చలనమే తన రూపముగా గల శ్రీ స్వా॥

25. **ఓం అరిషడ్వర్గ వినాశకాయ నమః**
భక్తులలోని కామము, క్రోదము, లోభము, మోహ, మద, మాశ్చర్యములను నశింపజేయు శ్రీ స్వా॥

26. **ఓం దృశ్యాయ నమః** - మనోదేహాదుల నుండి విశ్వము వరకు గల సర్వదృశ్యములు తానైన శ్రీ స్వా॥

27. **ఓం దృగ్రూపాయనమః**:- అట్టి దృశ్యమును చూచు చూపు తానైనట్టి శ్రీ స్వా॥

28. **ఓం హృదయాయనమః** :- దృక్కు, దృశ్యములు నేను అనెడు విషయము ఎవరివలన అనుభవమగునో అట్టి శ్రీ స్వా॥

29. **ఓం సర్వలోకాత్మకాయనమః** :- సర్వలోకములు తానేయైన శ్రీ స్వా॥

30. **ఓం సర్వలోక సాక్షిణేనమః** :- సర్వలోకములను ఆయాజీవుల హృదయముల నుండి అనుభవించు శ్రీ స్వా॥

31. **ఓం సర్వదేవతా స్వరూపిణేనమః**:- సకలదేవతలు తానైనా శ్రీ స్వా॥

32. **ఓం ఆకాశగమనాయనమః** :- సంకల్ప మాత్రమున కోరినచోట ప్రకటమవ గల శ్రీ స్వా॥

33. **ఓం గమనాగమన రహితాయ నమః** :- చలనమేలేని శ్రీ స్వా॥

34. **సర్వత్ర స్థితాయనమః** :- సర్వత్ర నిండియున్న శ్రీ స్వా॥

35. **ఓం సన్మాత్రాయనమః** :- సత్ లేక పరబ్రహ్మమే తానైన శ్రీ స్వా॥

36. **ఓం సర్వాధారాయనమః** :- సర్వమునకు ఆధారమైన శ్రీ స్వా॥

37. **ఓం నాథ నాథాయనమః** :- నాథసాంప్రదాయమునకు ప్రభువైన శ్రీ స్వా॥

38. **ఓం యోగాయనమః** :- యోగమే తన నిజస్థితియైనన శ్రీ స్వా॥

39. **ఓం యోగీశ్వరాయనమః** :- యోగులందరికి ప్రభువైన శ్రీ స్వా॥

40. **ఓం యోగయోగ్యాయనమః**:- యోగ సాధనకు కేంద్రముగా నిలుపు కొనుటకు యోగ్యుడైన శ్రీ స్వా॥

41. **ఓం యోగ గమ్యాయనమః** :- యోగ సాధన ద్వారా పొంద దగిన ఆత్మ తత్వమైన శ్రీ స్వామి॥

42. **ఓం సర్వయోగ స్వరూపాయనమః** :- హఠ, మంత్ర, రాజ, జ్ఞానయోగములే తన తత్వముగా గల శ్రీ స్వా॥

43. **సర్వయోగి స్వరూపాయనమః :-** యోగ రూపమున అందరు యోగులలో వెలుగొందు శ్రీ స్వా॥

44. **ఓం సిద్ధిదాయనమః :-** సాధనలో పరిపూర్ణతను ప్రసాదించు శ్రీ స్వా॥

45. **ఓం సిద్ధాయనమః :-** యోగ పరిపూర్ణులైన శ్రీ స్వా॥

46. **ఓంసిద్ధయోగినేనమః:-** సిద్ధయోగము ఒక ప్రత్యేక సాంప్రదాయము. అట్టి యోగమున పరిపూర్ణులైన శ్రీ స్వా॥

47. **ఓం సర్వ సిద్ధసేవితాయనమః :-** యోగములో పరిపూర్ణలైన మహాత్ములందరూ సేవించు శ్రీ స్వా॥

48. **సర్వసిద్ధి సేవితాయనమః:-** సర్వసిద్ధులూ పూజించు దత్తరూపుడగు శ్రీ స్వా॥

49. **ఓం విఘ్నరాజాయనమః :-** అశుభకార్యములకు విఘ్నములు కలిగించు విఘ్నరాజైన శ్రీ స్వా॥

50. **ఓం విఘ్నహంత్రేనమః:-** సత్కార్యములకు కలుగు విఘ్నములను నశింపజేయు శ్రీ స్వా॥

51. **ఓం విచిత్ర వేషాయనమః :-** తనదేమతమో సాంప్రదాయమో తెలియని వేషముగల శ్రీ స్వా॥

52. **ఓం చిత్త చాంచల్య వినాశాయనమః:-** భక్తుల చిత్త చాంచల్యము నసింపజేయు శ్రీ స్వా॥

53. **ఓం భేద వర్జితాయనమః:-** కుల, మత, జాతి భేదములేని శ్రీ స్వా॥

54. **ఓం కృపా నిధయేనమః :-** కృపకు మూలమైన శ్రీ స్వా॥

55. **ఓం కరుణామూర్తయేనమః :-** సకల జీవులపై గల కరుణయే రూపముగా గల శ్రీ స్వా॥

56. **ఓంసమదర్శినేనమః:-** అన్ని రూపాలలో ఒకే పరమాత్మ తత్వమును చూచు శ్రీ స్వా॥

**57. ఓం ఆత్మదర్శినేనమః :-** అన్నింటినీ, అందరినీ తన రూపముగా దర్శించు శ్రీ స్వామి॥

**58. ఓం పరమాత్మ స్వరూపాయనమః :-** అన్ని జీవులకు ఆత్మ స్వరూపమైన శ్రీ స్వా॥

**59. ఓం వర్షరూపక యజ్ఞకృతేనమః :-** వర్షము కురిపించుట ద్వారా ప్రకృతి యజ్ఞము నడుపు శ్రీ స్వా॥

**60. ఓం సకాలవర్షధాత్రేనమః:-** ప్రకృతి శక్తులను శాసించి సకాలమున వర్షము కురియునట్లు చేయు శ్రీ స్వా॥

**61. ఓం సద్ధర్మ సంరక్షకాయనమః :-** ఆత్మ ప్రాప్తికి ఆచరించవలసిన ధర్మమును భక్తుల చేత ఆచరింపజేయు శ్రీ స్వా॥

**62. ఓం సదాచార విగ్రహాయనమః :-** మూర్తీ భవించిన సదాచార సంపన్నుడైన శ్రీ స్వా॥

**63. ఓం ఆచార వర్జితాయనమః :-** ఎట్టి ఆచారము లేని శ్రీ స్వా॥

**64. ఓం రోగనివారణేనమః:-** తన్నాశ్రయించిన వారి రోగములు బాపు శ్రీ స్వా॥

**65. ఓం సర్వశాస్త్ర స్వరూపాయనమః :-** సర్వ శాస్త్రరూపములలో ప్రకటమైన శ్రీ స్వా॥

**66. ఓం సర్వాచార సంసేవితాయనమః :-** సర్వమతాచారములు ఏ పరమాత్మను సేవించునో అదే తానైన శ్రీ స్వా॥

**67. ఓం వేద వేద్యాయనమః :-** వేదములకు లక్ష్యార్థమైన శ్రీ స్వా॥

**68. ఓం వేదాత్మనేనమః :-** వేదములే తానైన శ్రీ స్వా॥

**69. ఓం వేదకర్త్రేనమః:-** జీవుల హితము కొరకు వేదములు సృష్టించిన శ్రీ స్వా॥

**70. ఓం వేదసంరక్షకాయనమః :-** వేదములను సదాకాపాడు శ్రీ స్వా॥

**71. ఓం యజ్ఞాయనమః :-** సృష్టియజ్ఞమే తానైన శ్రీ స్వా॥

**72. ఓం యజ్ఞపురుషాయనమః :-** సమిష్టి యజ్ఞమునకు కారణమైన చైతన్యరూపుడైన శ్రీ స్వా॥

**73. ఓం యజ్ఞభోక్త్రేనమః :-** అట్టి యజ్ఞము ద్వారా తృప్తి బొందు శ్రీ స్వా॥

**74. ఓం యజమానినేనమః :-** యజ్ఞము జరుగునట్లు శాశించు శ్రీ స్వా॥

**75. ఓం జ్ఞానయజ్ఞాయనమః :-** అజ్ఞాన సంస్కారములన్నీ ఏ జ్ఞాన యజ్ఞములో ఆహుతి చేయబడునో అట్టి జ్ఞానయజ్ఞ స్వరూపుడగు శ్రీ స్వా॥

**76. ఓం ధ్యానయజ్ఞాయ నమః :-** ద్యానమనెడి అగ్నిలో విక్షేపములను అవివేకము ఆహుతి చేయబడునో అట్టి ధ్యానరూపుడగు శ్రీ స్వా॥

**77. ఓం బోధయజ్ఞాయనమః :-** ఆధ్యాత్మబోధ రూపుడైన శ్రీ స్వామి॥

**78. ఓం భక్తియాజ్ఞయనమః :-** సాధకులు ఏ భక్తియనెడి అగ్నిలో అన్య చింతలను ఆహుతిచేతురో అట్టి భక్తి రూపుడైన శ్రీ స్వా॥

**79. ఓం సృష్టియజ్ఞాయనమః :-** సృష్టియనెడి యజ్ఞరూపుడైన శ్రీ స్వా॥

**80. ఓం చిదగ్ని కుండాయనమః :-** తనచేతనాగ్ని నుండి సకల సృష్టినీ పుట్టించు శ్రీ స్వా॥

**81. ఓం విభూతయే నమః :-** విభునియొక్క మహిమయే విభూతి. అట్టి మహిమాన్వితమైన శ్రీ స్వా॥

**82. ఓం లీలాకల్పిత బ్రహ్మాండమండలాయనమః :-** తనలీలచేత బ్రహ్మాండములను సృష్టించిన శ్రీ స్వా॥

**83. ఓం సంకల్పిత సర్వలోకాయనమః :-** తన సంకల్పము చేత సర్వలోకములు సృష్టించిన శ్రీ స్వా॥

**84. ఓం ఆహారాయనమః :-** తాను సృజించిన జీవులకు తానే ఆహారమైన శ్రీ స్వా॥

**85. ఓం నిరాహారాయనమః :-** తనకుగా వేరు ఆహారము అవసరములేనట్టి శ్రీ స్వా॥

**86. ఓం తీర్థపాదాయనమః:-** సకల తీర్థములు తన పాదములందుగల శ్రీ స్వా॥

**87. ఓం తీర్థపాలకాయనమః :-** పుణ్య తీర్థముల పవిత్రతను కాపాడు శ్రీ స్వా॥

**88. ఓం త్రికాలజ్ఞానాయనమః:-** భూత, భవిష్యత్, వర్తమాన కాలముల నెరిగిన శ్రీ స్వా॥

**89. ఓం కాల రహితాయనమః :-** త్రికాలములూ మాయామాత్రమేనని ఎరిగిన శ్రీ స్వా॥

**90. ఓం దృక్ దృశ్యభేద వివర్జితాయనమః :-** ద్రుక్కు దృశ్యముల తానే ఉన్నట్లు ఎరిగి అట్టి భేదమునకతీతుడైన శ్రీ స్వా॥

**91. ఓం ప్రణవాయనమః :-** తనను ధ్యానించు వానిని పరమాత్మను చేర్చు ప్రణవ రూపుడైన శ్రీ స్వా॥

**92. ఓం శబ్ద రూపిణే పరం బ్రహ్మణే నమః :-** శబ్ద రూపుడూ, పరం బ్రహ్మరూపుడూ తానైన శ్రీ స్వా॥

**93. ఓం దేవాలయాయనమః :-** సకలదేవతలకూ నిలయమైన దేవాలయమేతానైన శ్రీ స్వా॥

**94. ఓం సర్వ ధర్మ సంసేవితాయనమః :-** సకల మత ధర్మములూ సేవించునట్టి శ్రీ స్వా॥

**95. ఓం సర్వధర్మ సంస్థాపకాయనమః :-** సర్వమత ధర్మములను నెలకొల్పిన శ్రీ స్వామి॥

**96. ఓం ధర్మ స్వరూపాయనమః :-** ధర్మమే తానైన శ్రీ స్వా॥

97. **ఓం అవధూతాయనమః** :- మాలిన్యములు సంపూర్ణముగా త్యజించినవాడే అవదూత అట్టి శ్రీస్వా॥

98. **ఓం లీలామానుష విగ్రహాయనమః** :- తన దివ్యలీలల చేత మానవులకు తనను తెలియజేసుకొను శ్రీ స్వా॥

99. **ఓం లీలా విలాసాయనమః** :- భక్త రక్షణ కొరకు తన దివ్యలీలలు ప్రకటించు శ్రీ స్వా॥

100. **ఓం స్మృతి మాత్ర ప్రసన్నాయనమః**:- భక్తులు హృదయపూర్వకముగా స్మరించినంతనే ప్రసన్నుడగు శ్రీ స్వా॥

101. **ఓం గొలగమూడి ఆశ్రమ వాసినేనమః**:- గొలగమూడి ఆశ్రమమునే తన ఆశ్రయముగా చేసుకున్నా శ్రీ స్వా॥

102. **ఓం భక్త భారభృతాయనమః** :- భక్తుల భారములను మోయు శ్రీ స్వా॥

103. **విశ్వప్రేరణాధి కారిణేనమః** :- విశ్వములోని సర్వప్రేరణలకు కారకుడైన శ్రీ స్వా॥

104. **సర్వప్రేరణాధి కారిణేనమః** :- సర్వప్రేరణలకు కారకుడైన శ్రీ స్వా॥

105. **సర్వసమర్ధాయనమః** :- సర్వముచేయ గల సమర్ధులైన శ్రీ స్వా॥

106. **సచ్చిదానంద స్వరూపాయ నమః** :- సత్, చిత్, ఆనంద రూపులైన శ్రీ స్వా॥

**సత్** - అన్నికాలములందు ఉండునట్టి

**చిత్** - చైతన్యరూపుడు

**ఆనంద** - ఆనందమే స్వభావము.

107. **ఓం గురుభక్తి ప్రధాత్రేనమః** :- గురుభక్తి ప్రసాధించు శ్రీ స్వా॥

108. **ఓం ఆత్మ జ్ఞాన ప్రధాత్రేనమః** :- ఆత్మ జ్ఞానమును ప్రసాదించు శ్రీ స్వా॥

# దండకము

ఓం సర్వసమర్ధ సద్గురు శ్రీ వెంకయార్యస్వామియే నమః

ఓం శ్రీ సద్గురు, ఓం శ్రీ రామవతారా

ఓం శ్రీ కృష్ణావతారా, శ్యామలాకార

నాకన్న తండ్రి, జగన్నాథా,

ఆపన్నివారా, ప్రసన్నాత్మా

సంవాస, దేవాది దేవ

మహాదేవా, గోవింద

సర్వాత్మ, సర్వజ్ఞ

సర్వేశ, సర్వార్చిత

సర్వశక్త, హరే

సర్వసాక్షి, ముకుంద

పరంధామ, సర్వోత్తమ

నామరూప, క్రియాసూన్య

జ్ఞాన స్వరూపా, అనంతాత్ముత

అప్రమేయా, కళాప్రపూర్ణ తేజోమయా

సత్యసంకల్పస్వామి, పరంబ్రహ్మ మూర్తి

మొదల్నిన్ను నేనెన్నడో

ఎందుకోబాసి అన్నింటి యందున్న

నిన్గానక, ఎన్నెన్ని జన్మంబులో

బొందితిన్, కుందితిన్

కందితిన్, కావుకావంటి

ఈ నేలపై మొన్నపుట్టగనే

గట్టిగా మీకు చేపత్తి, నా ఆత్మలో మ్రొక్కితిన్

దీన బంధూ, దయాసింధూ
ఈ జన్మమందైన, మీ వాడనౌ
నాకు కైవల్య మీవేతగన్
వేరునేనేమియున్ గోరనోదేవా
దివ్య ప్రభావా, భవత్
జ్ఞాననేత్రంబుతో జూడ
శబ్దంబులో నుండు శబ్దంబుమీ పల్కు,
స్పర్శంబులో నుండు స్పర్శంబు మీతాకు
రూపంబులో నుండు రూపంబు మీ రూపు
సారంబులో నుండు సారంబు మీ తీపి
గంధంబులో నుండు గంధంబు మీ తావి
ఈ మన్ను మీమాయ, ఈ మిన్ను మీ మాయ
ఈ గాలి మీ మాయ, ఈ నీరు మీ మాయ
ఈ వెల్గు మీ మాయ
ఈ పంచభూతాత్మకంబౌ ప్రపంచంబు మీ మాయ
మీ మాయ అన్నియున్
మీరు కమ్మన్న మాత్రాన కాదా
అదేదైన రమ్మన్న మాత్రాన రాదా,
అదేదైన పొమ్మన్న మాత్రాన పోదా
అదేదైన మీ బల్మియే బల్మి, మీ కల్మియే కల్మి
మీ విద్యయే విద్య, మీ బుద్ధియే బుద్ధి
మీ తెల్వియే తెల్వి, మీ తేటయే తేట
మీ ఇచ్ఛయే ఇచ్ఛ, మీ మాటయే మాట
మీ పాటయే పాట, మీ ఆటయే ఆట

మీరు మీరే మహాసత్వసంపన్నా
నాపట్టు కొమ్మైన
ఈ మీరు నాపట్టుయైయుండ
ననున్ పట్టు వారేరి
ననున్ గట్టువారేరి, ననున్ తిట్టువారేరి
ననున్ గొట్టువారేరి
యిందైన, అందైన, ఎందైనమీరేకదా
విచారింప మీ ఆజ్ఞలేకున్న
ఆకైన అల్లాడునా, మీరుతోడైన
ఏమిన్నునన్ వంచు
ఏ నీరునన్ ముంచు
ఏ గాలినన్ తొల్చు, ఏ అగ్నినన్ గాల్చు
ఏ శక్తినన్ గూల్చు
ఏమైన నన్నేమి చేయున్
పవల్రేయి బ్రహ్మాండ బాండంబు
నందంతటన్, తాండవంబాడు
మీ దివ్యతేజంబు ఒక్కంగి
నాకున్ సదా దిక్కు మీరొక్కరే
ఎక్కడన్ మక్కువన్
జీవులన్ గావగా బ్రోవగా
మీకే జెల్లున్ ప్రభూ!
ఓం సద్గురు పరబ్రహ్మణే నమః
పాహిమాం పాహిమాం పాహిమాం
నమస్తే నమస్తే నమస్తే నమః

**11. ధూపము :-**

**శ్లో॥ వనస్పతిరసైర్దివ్యైర్నానాగంధైస్సుసంయుతమ్।**
**ఆఘ్రేయస్సర్వదేవానాం ధూపోఽయం ప్రతిగృహ్యతామ్॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః ధూపమాఘ్రాపయామి.*

తా॥ దివ్యమైన వనస్పతుల రసములు నానావివిధ సుగంధ ద్రవ్యములతోగూడిన ఈ ధూపమును (సద్గురువు రూపముననున్న) సకల దేవతలు ఆఘ్రాణించుదురుగాక!

**12. దీపము :-**

**శ్లో॥ జ్ఞానజ్యోతిస్వరూపస్త్వం ఆత్మజ్ఞానప్రదాయక।**
**ఘృతవర్త్యాకృతం దీపం దాస్యామి స్వీకురుప్రభో॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః దీపం దర్శయామి.*

తా॥ నీవు జ్ఞానజ్యోతి స్వరూపుడవు, ఆత్మజ్ఞాన ప్రదాయకుడవు, ఓ ప్రభూ! నేయి, వత్తితోచేయుబడిన దీపమును సమర్పించుచున్నాను. స్వీకరించుము.

**13. నైవేద్యము :-**

సత్యంచిత్తేన పరిషించ్యామి। అమృతమస్తు। అమృతోపస్తరణమసి స్వాహా ॥

**శ్లో॥ పక్వాన్నం పంచభక్ష్యాణి గోఘృతం సూపసంయుతమ్।**
**లేహ్యం పేయం తదాచోష్యం స్వీకురు ప్రాణవల్లభ॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః నైవేద్యం సమర్పయామి.*

శ్లోక వివరణ :- పప్పు, పానీయము, నాలుకతో స్వీకరించదగినవి మరియు చప్పరించదగిన ఐదురకముల భక్ష్యములతోకూడిన పక్వాన్నమును, ఆవునేతితోకూడిన దానిని స్వీకరింపుము. ఓ ప్రాణేశా!

**ఓం ప్రాణాయ స్వాహా - ఓం అపానాయ స్వాహా**
**ఓం వ్యానాయ స్వాహా - ఓం ఉదానాయ స్వాహా**
**ఓం సమానాయ స్వాహా**

తా॥ ఒక్కటే అయినట్టి పురుషుని ప్రాణశక్తి ఐదుగా ఏర్పడి సకల జీవుల పంచప్రాణముల రూపమున వాటి దేహముల నిలుపుచుండును. ఆహారము ఆ పంచప్రాణములను పోషించును కనుక నివేదన సద్గురు రూపముననున్న పంచప్రాణములద్వారా సకలజీవులలోను పనిచేయు పంచప్రాణములకు అర్పించుటయే ఈ ప్రాణాహుతుల లక్ష్యము.

**ఉత్తరాపోశనం సమర్పయామి**

**హస్తప్రక్షాళనం సమర్పయామి**

**పాదప్రక్షాళనం సమర్పయామి**

**శుద్ధాచమనీయం సమర్పయామి**

*వివరణ - దీని భావము సుస్పష్టము.*

**14. తాంబూలం :-**

**శ్లో॥ పూగీఫలైస్సకర్పూరైర్నాగవల్లీదళైర్యుతమ్।**
**ముక్తాచూర్ణసమాయుక్తం। తాంబూలం ప్రతిగృహ్యతామ్॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః తాంబూలం సమర్పయామి.*

తా॥ పోకచెక్కలు, పచ్చకర్పూరము, తమలపాకులు, ముత్యములనుండి చేయబడిన సున్నముతోను కూడిన తాంబూలమును మీరు స్వీకరింతురుగాక!

**15. నీరాజనము :-**

**శ్లో॥ నీరాజనమిదం జ్ఞానదీపక సద్గుణాకర।**
**పూరయిత్వామనోవాంఛాం స్వీకురు భజన ప్రియ।**

**శ్లో॥ మంగళం జ్ఞానసంపన్న మంగళం సుజనప్రియ।**
**మంగళం జగధోద్ధార మంగళం దేశికోత్తమ॥**

*శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః నీరాజనం సమర్పయామి.*

తా॥ నీ భక్తుని యందు జ్ఞానమునుద్దీపింప జేయువాడా! సద్గుణములను ఉత్పన్నము చేయువాడా! వారు చేయు భజనమునందు ప్రీతిగొనువాడా! (నీ కృపకై) నాకు గల మనోవాంఛను పూరింపచేసి నీరాజనమును స్వీకరించుమా.

*2వ శ్లోక వివరణ - అర్థము సుస్పష్టము.*

**వేదాహమేతం పురుషం మహాన్తమ్ - ఆదిత్యవర్ణం తమసస్తుపారే,
సర్వాణి రూపాణి విచిత్యధీరః - నామానికృత్వా అభివదన్ యదాస్తే॥
దాతాపురస్తాద్యముదాజహార
శక్రఃప్రవిద్వాన్ ప్రదిశశ్చతస్రః
త్వమేవంవిద్వానమృత ఇహాభవతి
నాన్యఃపంథా అయనాయవిద్యతే॥**

**మంత్రవివరణ :-** సృష్టిలోని రూపములను గూర్చి చక్కగ వివేచించి, సాత్త్వికమైన బుద్ధిబలముగలవాడు (వాటిరూపమున ఆ పరపురుషుడే వున్నాడు అను విషయమును తెలుపు) నామములను వాటికి కల్పించి (ఆ నామ్మములను చదువుచు) అభివందనము (పురుషునకు) చేయుచు, "అజ్ఞానమను పెంచీకటికావలి ఒడ్డుగావున్న జ్ఞానమను సూర్యసమానమైన, తేజోరూపమునగల మహాత్ముడైన ఈ పురుషుని తెలుసుకొందును గాక!" అని ఎవడు తెలుసుకొనునో అట్టివాడు ఆత్మజ్ఞాని అగును.

**గమనిక :-** బహిర్ముఖముగనున్న ఇంద్రియ మనస్సులు అజ్ఞానాంధకారము. అంతర్ముఖమైన, తెలియబడు నేను అనే ప్రజ్ఞానమే పురుషుడు, ఆయనయే అన్నిరూపములనున్నాడు.

**మంత్రవివరణ :-** ప్రళయకాలమున ఏకార్ణవమైన చైతన్యమునందు నామ రూపాత్మకమైన సృష్టికర్తయైన బ్రహ్మ ఉద్భవించి, పురుషుని ధ్యానించి తాను తిరిగి సృష్టిచేయవలసిన క్రమమును సూక్ష్మరూపముననున్న దానిని సర్వత్ర (ఇట్లే) తెలుసుకొనెను. దేవరాజైన ఇంద్రుడు నాలుగు దిక్కులందును ఆయననిట్లే తెలుసుకొనెను. మోక్షమునకంతకంటే వేరు దారిలేదు. ఆయననెరిగినవాడు అమృత రూపుడగును.

**శ్లో॥ శ్రద్ధాభక్త్యా అక్షతైశ్చ హృత్పద్మ సహితం గురో।**
**మయార్పితం మంత్రపుష్పం స్వీకురు శిష్యవత్సల॥**

శ్రీ సద్గురు పరబ్రహ్మణేనమః మంత్రపుష్పం సమర్పయామి.

శ్లోకవివరణ :- శ్రద్ధాభక్తులతోకూడిన హృదయముతో అక్షతల రూపమున నాచే అర్పింపబడిన మంత్రపుష్పమును, ఓ శిష్యవత్సలా! స్వీకరింపుము.

**నమస్కారము**

**శ్లో॥ నమః ప్రసన్నవదన నమః కారుణ్యసాగర।**
**నమః కర్మఫలత్యాగిన్ నమః పాప నికృంతన॥**

**శ్లో॥ నమో స్త్వనంతాయ సహస్రమూర్తయే**
**సహస్రపాదాక్షిశిరోరు బాహవే।**
**సహస్రనామ్నే పురుషాయ శాశ్వతే**
**సహస్రకోటి యుగ ధారిణే నమః॥**

శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః సప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

తా॥ ఓ ప్రసన్న వదనా ! నమస్కారము. ఓ కరుణాసాగరా ! నమస్కారము. విద్యుక్తముగా కర్మలనాచరించియు వానిఫలమును పరిత్యజించిన స్వామీ ! నమస్కారము. పాపమును నశింపజేయు స్వామీ ! నమస్కారము.

తా॥ అనంతుడును, అసంఖ్యాకమైన శిరోపాద బాహువులతోకూడిన అనంతమైన రూపములు ధరించిన వానికి నమస్కారము. శాశ్వతుడైన పురుషునకు, అనంతరూప, నామములు కలవానికి, సహస్రకోటి యుగముల రూపమును ధరించిన (కాల) పురుషునికి నమస్కారము.

**ఆత్మ సమర్పణము :-**

**శ్లో॥ త్వమేవ మాతా చ పితా త్వమేవ**
**త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ।**
**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ**
**త్వమేవ సర్వం మమ దేవదేవ॥**

శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః ఆత్మసమర్పణం సమర్పయామి.

తా॥ నీవే తల్లివి, తండ్రివి, బంధువు, మిత్రుడవు, విద్యవు, ధనము, నీవే నా సర్వస్వమవు.

**గమనిక :-** నా అనబడునదంతయు నీవే అని భావము.

**ఇతర ఉపచారములు :-**

శ్రీ సద్గురు పరబ్రహ్మణే నమః ఛత్రమాచ్ఛాదయామి - చామరం వీచయామి - నృత్యం దర్శయామి - ఆందోళికానారోహయామి - అశ్వానారోహయామి - గజానారోహయామి - సమస్త రాజోపచార, దేవోపచార, శక్త్యుపచార, భక్త్యుపచార పూజాం సమర్పయామి.

**సర్వం శ్రీ పరమేశ్వరార్పణమస్తు.**

తా॥ పరబ్రహ్మ స్వరూపియైన గురువునకు (రాజలాంఛనమైన) ఛత్రమును పట్టుచున్నాను. చామరములతో వీచుచున్నాను. నృత్యప్రదర్శనము చేయుచున్నాను. ఊయలయందు కూర్చొనబెట్టి ఊపుచున్నాను. అశ్వారోహణము, గజారోహణము చేయించుచున్నాను. ఇట్లు రాజులకు, దేవతలకు, పరాశక్తికి (లేదా యధాశక్తి) భక్తితో కూడిన ఉపచారములతో పూజను సమర్పించుచున్నాను. (యజ్ఞమను భావముతో చేసిన) ఈ పూజ (లేక సర్వము), ఈ పూజా ఫలముగూడ పరమేశ్వరార్పణమగుగాక.

**గమనిక :-** పూజింపబడువాడు, పూజ మరియు పూజాఫలము ఆ పరమపురుషుని రూపమేనని బాగుగ ధ్యానించవలెను.

# గురుస్తుతి

1. ఓం గురుదేవా! మిము శరణమంటిని కరుణామయా కృపజూపుమయా! ఓం కరుణామయా కృపజూడు మయా! అమృత హృదయా! ఆనందనిలయా! మీపదసేవయే మా భాగ్యమయా! ఎన్నోజన్మల పుణ్యమయా ॥ఓం గురు॥

2. లింగదేవుడవు! సంఘరహితుడవు! నిర్గుణ మూర్తివి నీవెనయా! నిరాకారుడవు నీవేనయా! మంగళకర! నినుమదిలో నిల్పిన మాయ తొలంగుట సత్యమయా ॥ఓం గురుదేవా॥

3. అన్నదాతవు, హృదయనేతవు, అభీష్టఫల ప్రధాతవయా! అనాధ రక్షకుడీవెనయా! నిరపరాదులము, నిస్సహాయులము, నీదరిచేర్చి కావుమయా! నీదయ మమ్ముజూడుమయా ॥ఓం గురుదేవా॥

4. అష్టకష్టములు, అరిషడ్వర్గము లంటకుండ మము చూడుమయా! మా కంటకుండ దయ చూడుమయా! దుష్టగుణంబులు దూరము బాపెడి వెంకయ్యస్వామీ సద్గురు దేవుడు నీవెనయా! అవధూతేంద్రుడు నీవెనయా ॥ఓం గురుదేవ॥

5. తల్లివి, తండ్రివి, గురుడవు, దైవము సర్వభారము నీదెనయా! మాబ్రతుకు భారము నీదెనయా! శివకేశవుల అవతారంబని చిత్తములో నిను గొల్తుమయా! మా చిత్తములో నిను కొలువుండుమయా ॥ఓం గురుదేవా॥

(శ్రీ ఆచార్యులవారి పర్యవేక్షణలో అచ్చువేయడమైనది.)

**మంగళహారతి :-**

మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే।
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళం॥
మంగళం వేద వేద్యాయ మేఘశ్యామలా మూర్తయే।
పుసాం మోహన రూపాయ పుణ్య శ్లోకాయ మంగళం॥
రామచంద్రాయ మంగళం రామ క్రిష్ణాయ మంగళం।
గురుదేవాయ మంగళం సద్గురు దేవాయమంగళం॥

స్వామి వెంకయార్యాయ గొలగమూడి వాసాయ
మామకా భీష్టదాయ మహిత మంగళం॥
లోక నాధాయ సర్వలోక సంరక్షకాయ
నాగలోక స్తుత్యాయ నవ్య మంగళం ॥స్వామి॥
భక్త బృందవందితాయ బ్రహ్మస్వరూపాయ
ముక్తిమార్గ బోధకాయ పూజ్య మంగళం ॥స్వామి॥
సత్యతత్వ బోధకాయ సాధువేషాయతే
నిత్య మంగళ దాయ కాయ నిత్య మంగళం ॥స్వా॥

# యాంత్రికము లాంచనప్రాయమైన పూజ

యాంత్రికము లాంచనప్రాయము అయిన పూజవలన సత్ఫలితాలు పొందలేము అంటారు పూజ్యపాదులు శ్రీభరద్వాజమాష్టర్ గారు. యాంత్రికమనగా టేప్ రికార్డువలె మంత్రాలు వల్లించడం. మంత్రాల అర్థం తెలుసుకోకుండా, అర్థమననం చేయకుండా చేసే పూజ అని అర్థం. లాంచన ప్రాయమంటే - పెండ్లి కొడుకు పెండ్లి కుమార్తెకు చెంగుమడి వేస్తారు. అది ఒక లాంఛనము. ఇద్దరికి నడినెత్తిన బెల్లం జిలకరపెడతారు. అది ఒక లాంఛనము. ఆపని ఆర్థమేమిటి? ఎందుకు చేస్తున్నామనే విషయం తెలియకుండాచేయడం. అలాగే పూజ యొక్క ధ్యేయమేమిటి అని తెలుసు కోకుండా ఆ ధేయ్యం సాధించేమార్గంలో పూజచేయకుండా పోవడం.

**దానం స్వధర్మో, నియమోాయమశ్చ, శ్రుతంచశాస్త్రాణి**
**సద్వ్రతాని సర్వే మనో నిగ్రహలక్షణాంతాహ:॥**

అన్నారు. సర్వే అనే మాటలో పూజకూడా వస్తుంది. మనస్సు నిగ్రహించడమే ధ్యేయం.

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి వారి వంటి సద్గురువును నిత్యం పూజించగల్గడం మన పూర్వ పుణ్యఫలమే అనడంలో సందేహంలేదు. ఆమహనీయుని నిజస్థితిని అర్థం చేసుకొని రోజులో కొంతసేపైనా వారి దివ్యస్థితిని ప్రయత్నపూర్వకంగానైనా అనుభవించడమే ధ్యేయం. అందుకు పూజలోని నామాల అర్థం తెలుసుకోవాలి. అంతేగాక ఆ నామానికి సంబందించిన లీలలు మననం చేస్తూ అదే నామాన్ని నెమ్మదిగా ఎంత సేపైనా చెప్పుకోవచ్చు ఇంతసేపటిలో నామాలన్నీ చెప్పాలనే నియమంలేదు.

భగవాన్ శ్రీవెంకయ్యస్వామి వారి చేతనూ, శ్రీ శ్రీ పాకలపాటి గురువు గారి చేతనూ శ్రీ విష్ణుమూర్తి యొక్క అవతారమని కీర్తించబడ్డ ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టర్ గారు ఒక్కొక్కపుడు ఉదయం ఎనిమిదిగంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు చాలా

నెమ్మదిగా నామాలు చెపుతూ వాటి అర్థాన్ని మననం చేస్తూ వాటికి సంబందించిన లీలలు స్మరిస్తూ పూజ చేస్తుండేవారు.

భగవంతుడు నిజంగా మన నుండి కోరేది మన మనస్సు కాలములని శ్రీ భరద్వాజ మాష్టర్ గారు చెప్పేవారు. మనం పై విధంగా పూజ చేసినంతసేపు కాలము, మనస్సు దైవానికి సమర్పించినట్లేగదా.

ఈ పూజ చేసే విధానంలో ఎక్కువ మందిమి చేసే తప్పు ఒకటుంది. ఈ రోజు ఉ॥ 7.30ని॥ పూజ చేస్తే మరోక రోజు పనితీరిక లేదని గాని, చుట్టాలు వచ్చారని గాని 7.30గం॥ కాకుండా మరొక టైంలో చేస్తాము. ఓపిక లేకుంటే అసలు పూజచేయము. ఇది గొప్పతప్పని చెప్పేవారు మాష్టరు గారు. మన కష్టకాలంలో, ఆపదలలోను మనపనులు గాని బంధువులు గాని వచ్చి మనలను ఆదుకోరు. అట్టి ఆపద సమయంలో శ్రీ స్వామి వారే మనలను ఆదుకోగలరు. అట్టి మహనీయుని అండ మనకు ఎప్పుడూ వదలకుండా ఉండాలంటే మనము మన 24 గం॥ కాలములో వారిసేవకు సమర్పిస్తామనుకున్నకాలం మనకెంత ఇబ్బందిగా ఉన్నా తప్పక వారికి సమర్పిస్తుంటే వారిని మనం పిలిచినప్పుడే కాదు పిలువకున్నా సరే వారు మన సహాయానికి వస్తారు. ఇది భక్తుల అనుభవం కూడా అయిఉంది.

## నామాల అర్థాలు - వాటికి సంబంధించిన లీలలు

100పేజీల నోట్సు పెట్టుకొని పేజీకి ఒక నామం చొప్పున వ్రాసిపెట్టుకోవాలి. మనకు అన్ని నామాలకూ సంబంధించిన లీలలూ ఒకేసారి గుర్తురావు. ఏరోజు ఏనామానికి సంబంధించిన లీల గుర్తొస్తే దాన్ని ఆ నామం క్రింద సంక్షిప్తంగా ఒకటి రెండు లైన్లలో వ్రాసిపెట్టుకునేది. ఇలా చేస్తూపోతే క్రమంగా అన్ని నామాలు పూర్తవుతాయి. ఉదాహరణకు-

**సర్వసమర్థ సద్గురు శ్రీ స్వామి నాథాయనమః** - ఏమైనా చేయసమర్థుడైన శ్రీ స్వామివారు అని అర్థం. ఒక వ్యక్తి పూర్తిగా నిషాలో ఉండి బండి గుజ్జు కర్రతో ముగ్గురు వ్యక్తులను ఏటుకోకర్ని చొప్పున ఒక్క నిమిషంలో చంపాడు. పోలీసు కేసయింది. ముద్దాయి శ్రీస్వామివారిని కన్నీటితో ఆశ్రయించాడు. కోర్టులో ఈతని కేసు రికార్డును

చెదలు రూపంలో శ్రీ స్వామివారే తినేశారు. అతని కేసు కొట్టివేయబడింది.

ఒక వ్యక్తి ఒకరికి ఎనిమిది లక్షలు ఎగగొట్టాడు. ఆ నష్టపోయిన వాడు శ్రీస్వామివారిని ఆశ్రయించి మ్రొక్కుబడి చెప్పుకున్నాడు. మూడు సంవత్సరముల నుండి లేని ఆలోచన శ్రీ స్వామిని ఆశ్రయించి మ్రొక్కు చెప్ప కోగానే కల్గింది. నీ రియల్ ఎస్టేట్స్ విషయం పేపరుకు వేయిస్తానని పోస్టుకార్డు వ్రాయగానే ఆవ్యక్తి వచ్చి ఎనిమిది లక్షలు కట్టాడు.

**విశ్వ ప్రాణాయ స్వామి నాథాయ నమః** - ప్రాణానికి ఒక సంకేతము చలనము. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది గదా! సైన్సు ప్రకారం ఇలాగే నెబ్యులాస్ అనబడే నక్షత్ర గుంపులు ఆకాశంలో కదలిపోతున్నాయట. అదిమన కంటికి కనబడదు. అన్ని జీవులలోని కణములలోనే గాక జడ పదార్ధములలోని పరమాణువులలో కూడ ఎలక్ట్రానులు నిరంతరముగుండ్రని కక్షలలో వేగంగా తిరుగు చున్నాయని సైన్సు చెపుతుంది.

**స్మృతి మాత్ర ప్రసన్నాయనమః** :- శ్రీస్వామివారిని తలచిన వెంటనే కాపాడువారు అని అర్థం. శ్రీహరికోటలో ఏడుసంవత్సరాలుగా బ్లీడింగ్‌తో బాధపడే ఆమె శ్రీ స్వామి వారిని తలవగానే బ్లీడింగ్ లేకుండా పోయింది. హైదరాబాద్ శోభగారు ప్రార్థించగానే ఆమె చర్మ వ్యాధి నయమైంది. చెముడుగుంట భక్తుడు చెవి నొప్పికి మద్రాసు పోతున్నాడు. రోడ్డులో శ్రీ స్వామివారి బొమ్మకు నమస్కరించగానే నొప్పిపోయింది. దమ్మపేట పాప హుండీలో రెండురూపాయలు వేసి నమస్కరించగానే డాక్టర్లవల్ల కాని కడుపు నొప్పిపోయింది.

**స్మృతి రహిత ప్రసన్నాయ నమః** :- శ్రీస్వామి వారిని తలవక పోయిన గాని రక్షించేవారు. రోశిరెడ్డి కుమారుని మామిడికాయల బర్తీ బండి కొండ పై నుండి నలభై అడుగులలోతులోని వాగులో పడినప్పటికీ ఎద్దులకుగాని బండికిగానీ, మనిషికిగానీ ఏమాత్రమూ దెబ్బతగులలేదు. అదే సమయంలో 150 మైళ్ళ దూరంలోని శ్రీస్వామివారు అతని పేరు వ్రాయించిన కాగితం తన తొడక్రింద పెట్టుకున్నారు. కస్తూరి అంకయ్య మనవడు నాలుగు సంవత్సరాల పిల్లవాడు దిగుడుబావిలో పడిన పావుగంట వరకు నీటిపై

పూవులాగ తేలుతున్నాడు. వాళ్ళ నాన్న వచ్చి నీటి నుండి బయటకు తీశాడు.

మా కాబోయే అల్లుడు మోటార్ బైక్ మీద నాకొరకు వస్తుంటే అదే సమయంలో నేను నెల్లూరు పోవాలని బస్సుకు రెండు బారల దూరములో ఉన్నాను. రెండు నిమిషాలు కళ్ళు తెరిచివున్నా ఈ లోకంలో లేను. బస్సు వెళ్ళి పోయింది. ఐదు నిమిషాలలో కాబోయే అల్లుడు వచ్చాడు. ఇద్దరం కలిసి నెల్లూరు వెళ్ళాము.

**పంచ భూతాత్మ స్వరూపాయనమః** పంచ భూతములు - భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము- భూగోళమంతా భూమి, సముద్రము అందలి ఉప్పొంగే అలలు, బావులలోని, నదులలోని నీరు, మేఘాలలోని ఆవిరంతా నీరే, సూర్యుడు శ్రీ స్వామి వారి అగ్నిగుండము, ప్రతి వస్తువులోను ఇమిడియున్న అగ్నితత్వము ఇవన్నీ కలిసి అగ్ని అవుతుంది. వాయువు అంటే వాయుతత్వము - సర్వత్రా వ్యాపించి యున్న గాలిలోని ఆక్సిజన్, నైట్రోజన్ మొ॥ వాయువులన్నీ కలిసి వాయుతత్వం. పైన చెప్పిన భూమి, నీరు,వాయువు, అగ్ని ఇవన్నీ ఉండేందుకు అవకాశమిచ్చినది ఆకాశమనబడును.

**బహిరంతర్ వ్యాపినేనమః** :- బయట, లోపల వ్యాపించిన తత్వము, జీవుల యొక్కయు, నిర్జీవుల యొక్కయు బహిరంతరములందు వ్యాపించినవాడు. మన ఇంటిలో ప్రతి అంగుళము స్థలములోను లెక్కలేనన్ని టి.వి. ఛానల్స్ ఉన్నాయి. అట్లాగే లెక్కకు మిక్కుటముగా టెలిఫోను ఛానల్సు పోతున్నాయి. ఒక దాని కొకటి ఢీకొట్టుకొని వాటి స్వభావాన్ని కోల్పోవడం లేదు. ఇదంతా బహిరంతరములందు వ్యాపించిన పరమాత్మ తత్వమే గదా!

**సర్వ వ్యాపినే నమః** :- సర్వత్రా ఉన్నవాడు - ఎక్కడో పంచలింగాల కోనకు పోతున్న భక్తులు ఒక చోట కూర్చోబోతే - ఇచ్చట ప్రమాదమొస్తుంది. కూర్చోవద్దు అన్నారు. నిజంగానే కొద్దిసేపటిలో అక్కడ కొండ చరియ విరగబడి పెద్ద పెద్ద బండలు దోవకడ్డంపడ్డాయి. కాళహస్తి దగ్గర నదిలో మునిగిపోయే వాడు - చచ్చాను స్వామీ అని అరువగానే ఒక యువకుని

వలె వచ్చి అతనిని ఒడ్డును చేర్చి అతని కంటి ముందే అదృశ్యమయ్యాడు. అంతా వ్యాపించిన తత్వము గనుకనే పిలవగానే ఆదుకోగలిగారు.

**దిగంబరాయనమః** :- దిగంబరుడు అంటే గుడ్డలు లేకుండా ఉన్నవాడని అర్థం కాదు. దిక్కులనే గుడ్డలుగా గలవాడు అని అర్థము. అంబరములు అంటే గుడ్డలు అని అర్థము. సర్వ దిక్కులా వ్యాపించియున్నాడు గనుక దిక్కులే వారి వస్త్రములు.

**విశ్వ సాక్షిణే నమః** :- విశ్వమంతా వ్యాపించి, సర్వాన్నీ సాక్షీ భూతుడుగా చూస్తున్నవాడు. సాక్షిగా చూస్తుండడమే గాక మనం చేసే పనులకు తగిన ప్రతిఫలమిస్తున్నవాడు. పనులు, మాటలే గాక ఆలోచనలు సహితం అనుక్షణం తెలుసుకుంటూ తగిన ప్రతిఫలమిస్తున్నవాడు.

**సర్వ జీవ స్వరూపాయ నమః** :- మానవులేగాక పిపీలి కాది బ్రహ్మ పర్యంతంగల సర్వ జీవులూ వారేనన్న మాట - ఏ ప్రాణిని ఆదరించినా వారికే చెందుతుంది ఏ ప్రాణిని హింసించినా వారిని హింసించేనట్లే అవుతుంది.

**నామ రూప రహితాయ నమః** :- **సర్వనామ రూపిణే నమః-** విశ్వ మంతా వ్యాపించి యున్నారు గనుక దేహ పరిమితులు లేవు. నామము అంటే పేరు, రూపము అంటే ఆకారము - ఇవి రెంటికీ పరిమితము కాని వాడు. బస్సులో పోతూనో రైలులో పోతూనో విమానంలో పోతూనో, ఓడలో పోతూనో ఆపదలో ఉండి స్మరించిన వెంటనే కాపాడుతున్నారు. బస్సులో రైలులో, విమానంలో, ఓడలోను వారు మన కంటికి కనబడకుండా మన చుట్టూ ఉన్న టి.వి. ఛానల్స్‌లాగ ఉండి మనలను రక్షిస్తున్నారు. శ్రీ పి.ఆర్.కె. ప్రసాద్ గారు ప్రయాణించే రైలు డీరెయిల్ అయి అటు ఇటూ ఊగి సలాడుతూ, చుట్టూరా పొగలు కమ్మేశాయి. ఇప్పుడు రైలు కంకర రాళ్ళపై పోతుంది. ప్రయాణీకులంతా భయభ్రాంతులై రైలు పెట్టె ఇరు ప్రక్కలున్న ద్వారముల గుండా దూకేశారు. ముగ్గురు చనిపోయారు అనేకులకు కాళ్ళు చేతులు విరిగాయి కొందరికి దెబ్బలు తగిలాయి. ప్రసాద్ గారు మరియు వీరి సతీమణి అరవిందమ్మ గారు పెట్టెలో నుంచి దూకలేదు. ఈమె తన చేతికున్న శ్రీ స్వామి వారి దారం

తెంచి రైలు పెట్టె కిటికీ కమ్మికి కట్టి శ్రీ స్వామిని ప్రార్థిస్తుంది. చిత్రంగా ఆ రైలు పెట్టె పడి పోకుండా ఒక అరకిలో మీటరు రాళ్ళలోనే ప్రయాణించేసి నిలబడి పోయింది. అందరూ ఆశ్చర్యపోయారు. ఆ పెట్టెలో వీళ్ళిద్దరు తప్ప ఇంకెవ్వరూ లేరు. మిగిలిన వాళ్ళందరికీ కాళ్ళు చేతుల విరగడం దగ్గర నుండి దెబ్బలు వరకు తగిలాయి శ్రీ స్వామి వారిని స్మరించిన వెంటనే ఎలా కాపాడారో చూడండి. వాళ్ళుండే దాన్ని బట్టియ్యా మనముండేది అన్న శ్రీ స్వామి వారి వాక్యం పరమసత్యమని నిరూపించారు.

**అరిషడ్వర్గ వినాశకాయ నమః** :- మనలోని అరిషడ్వర్గములు, అంటే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను హరించు వాడు అని అర్థము. శ్రీతులసమ్మగారు, శ్రీరోశిరెడ్డిగారు, శ్రీ వక్కెమ్మగార్ల అరిషడ్వర్గములు హరించారు. శ్రీ నరసమ్మగారి బంధు ప్రీతి, వ్యామోహాలను ఒక్క మాటతో హరించారు. ఈమె నిత్యము శ్రీ స్వామినివదల్లి ఇంటికి వెళ్ళి రావాలని శ్రీ స్వామి వారిని కోరేది. వారంగీకరించేవారు కాదు. ఒక రోజు ఆమెను చూచి "నరసమ్మ చచ్చి పోయిందనుకున్నానే" అని అన్నారు. ఆమె నిజంగానే త్వరలో చని పోతుందనుకున్నారు కానీ ఆనాటి నుండి ఆమెకు ఇంటికి పోవాలనే కోరికే లేకుండా పోయింది. అంతే గాక తన అంతిమ శ్వాస వరకు శ్రీ స్వామి సన్నిధి వదల రాదనే నిర్ణయముతో ఆశ్రమంలోనే ఉంటుంది. శ్రీ స్వామి వారిపై ఆమెకున్న ప్రీతి, గౌరవము మనకుంటే మనలను గూడ రక్షించి తీరుతారు. పెద్ద తుఫానులో గాడాంధకారమైన చీకటిలో మూడు కిలో మీటర్లు నడిచి శ్రీ స్వామి వారి బృందానికి అన్నం తెచ్చినందున తడిసి పోయి వణికిపోయింది. మరొకసారి శ్రీ స్వామివారి సన్నిధిలో శ్రీ స్వామి వారి సేవకులకేగాక వచ్చిన భక్తులకు కూడా సజ్జకుడుములు పెట్టాలని ఒక గంపడు కుడుములు మిరప్పొడి తెచ్చింది. అన్ని కుడుములు చేయాలంటే ఎన్ని సజ్జలు విసరాలి, ఎన్ని కట్టెలు కావాలి. ఎంత శ్రమ చేయాలి. శ్రీ స్వామి వారి యడల గల ప్రీతిచే కష్టము, నష్టము అనే మాటలు ఆమెకు తెలియనే లేదు. అలా మనము గూడా శ్రీ స్వామి వారిని సేవిస్తే మనలను గూడా తప్పక గట్టెక్కిస్తారు.

**సర్వ శాస్త్ర స్వరూపిణే నమః** :- సర్వ శాస్త్రముల యొక్క సారము శ్రీ స్వామి రూపములో భూమి పై వెలసింది. శాస్త్ర సారాన్ని చిన్న చిన్న పొడి మాటలలో చెప్పేవారు. "ఆశ పోతే అంతా పోతుండ్లయా" అన్నారు. ఇది వేదాలు, ఉపనిషత్తుల సారము. దీన్నే ఉపనిషత్తులలో

**యధా సర్వే ప్రముత్యంతే కామాయే స్వహ్రు దిశ్రితాః**

అథమర్త్యో అమృతో భవతి అత్ర బ్రహ్మసమశ్నుతే ఇంత పెద్ద శ్లోకము యొక్క సారాన్నే పై మాటలో చెప్పారు.

ఇదే విధంగా అన్ని నామాలకు సంబంధించిన లీలలను సంక్షిప్తంగా వ్రాసినిత్యం గుర్తు చేసు కుంటుండడం. ముఖ్యంగా మన స్వానుభవాలను గుర్తుచేసుకుంటుంటే శ్రీస్వామివారి నిజస్థితి బాగా వంట బట్టి శ్రీ స్వామివారి కృపకు పాత్రులవుతాము.

జ్ఞానేశ్వర్ మహరాజ్ పన్నెండు సంవత్సరాల పిల్లవాడు మొండిగోడను నడిపించాడు, దున్నపోతు చేత 4 1/2గం॥ సస్వరంగా వేదం పలికించారు. చనిపోయిన వ్యక్తిని బ్రతికించాడు. పితృదేవతలను తద్దినంరోజే ప్రత్యక్షంగా రప్పించారు. ఇట్టి మహనీయుడు భగవద్గీతకు వ్యాక్య వ్రాశారు. అందులో పూజ శారీరకము,వాచకము, మానసిక తపస్సుగా చెపుతారు. తపస్సంటే అడవులకు పోనక్కరలేదని ఇంటిలోనే నిత్యం ఒకే సమయంలో శ్రీగురుదివ్య లీలలు మననం చేయడంలో మనస్సును నియమించడమే తపస్సు అని పూజ్య శ్రీ ఆచార్య భరద్వాజమాష్టరు గారు చెపుతారు. అలా చేసి అందరము తరించేట్లు చేయుమని శ్రీ స్వామి వారిని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాం.

**నమో శ్రీ గురు దేవాయనమః**

లోకాన్ సమస్తాన్ సుఖినోభవంతు.

## మా యితర ప్రచురణలు

| | | |
|---|---|---|
| 1. | అవధూత లీల - శ్రీ వెంకయ్యస్వామి వారి చరిత్ర | 40-00 |
| 2. | అవధూత బోధామృతం-శ్రీవారి బోధలు | 15-00 |
| 3. | శ్రీ స్వామి సన్నిధి - శ్రీవారితో వారి సేవకుల అనుభవాలు | 15-00 |
| 4. | అవధూత లీల (ఇంగ్లీషు) | 30-00 |
| 5. | భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి (ఇంగ్లీషు) | 3-00 |
| 6. | శ్రీ స్వామి కృప (తెలుగు) | 1-00 |
| 7. | పిలిచిన పలికే దైవం | 1-00 |
| 8. | మౌనబోధ | 1-00 |
| 9. | శ్రీమాష్టారి మంచి మాట | 5-00 |
| 10. | శ్రీ ధునీవాలా దాదా చరిత్ర | 15-00 |
| 11. | శ్రీ వెంకయ్యస్వామి పూజ | 1-00 |
| 12. | వెన్నెల పూలు - శ్రీ వెంకయ్య స్వామి దివ్యత్వం | 1-00 |
| 13. | సాయికృప - కలిచేడు భక్తుల అనుభవాలు | |
| 14. | దివ్యలీలలు | 1-00 |
| 15. | వార్తాలాపం | 150-00 |
| 16. | బోధయజ్ఞాయనమః | 1-00 |
| 17. | మృత్యువుపై ఘనవిజయము | 1-00 |
| 18. | శ్రీశ్రీశ్రీ సుధీంద్ర బాబుగారు | |
| 19. | మనధర్మము - కర్తవ్యము | |

**గమనిక**

శ్రీ స్వామివారికి దక్షిణ పంపేవారు వ్యక్తుల పేర్లతో పంపరాదు. **"టు ది రిసీవర్ - శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం, గొలగమూడి (పోస్టు), (వయా) సర్వేపల్లి. నెల్లూరు జిల్లా - 524 321"** అనే అడ్రసుకు పంపవలెను.